పత్రిక ప్రకటన కాకినాడ, అక్టోబరు 7, 2019

## వివిధ పథకాల యూనిట్లు కచ్చితంగా గ్రౌండింగ్ కావాలి

## పారదర్శకతతో లబ్ధిదారుల ఎంపిక జరగాలి

## యూనిట్ల మంజూరులో స్పందన కార్యక్రమంలో చేసుకున్న దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి

- కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి

జిల్లాలో వివిధ కార్పొరేషన్ల ద్వారా అమలుచేస్తున్న పథకాల యూనిట్ల గ్రౌండింగ్ ఖచ్చితంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి తెలిపారు. సోమవారంనాడు కలక్టర్ కార్యాలయంలో వివిధ సంక్షేమ శాఖల అధికారులు, బ్యాంకర్లతో కలక్టరు మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ఈబీసీ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకతతో జరగాలన్నారు. ఈ ఎంపికను మండల స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీ ద్వారానే జరగాలన్నారు. యూనిట్ల గ్రౌండింగ్ విషయంలో ఎటువంటి అవకతవకలు లేకుండా చూడాలని వీటిపై పర్యవేక్షణ వుండాలన్నారు. ఇకనుండి వివిధ సంక్షేమ పథకాల పనితీరు ఆధారంగా క్షేత్రస్థాయిలో అమలుజరిగే పనులపై సమీక్షలు వుంటాయన్నారు. యూనిట్ల గ్రౌండింగ్‌కు కాలపరిమితి వుండాలన్నారు. వీటి ఎంపికలో మధ్య దళారుల ప్రమేయం లేకుండా చూడాలని కలక్టరు అధికారులకు ఆదేశించారు. వివిధ పథకాల ద్వారా లబ్ధిదారుల ఆర్థిక సామాజిక పరిస్థితులు మారే విధంగా వారి జీవనోపాధులు పెంపొందించే విధంగా యూనిట్లు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో 2018-19 సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్ అమలులో జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అదే విధంగా ఎస్టీ, బీసీ రెండో స్థానంలో నిలిచాయన్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో బీసీ కార్పొరేషన్ ద్వారా అమలు చేసే పథకాలను ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు. ఈ సంవత్సరం కాపు కార్పొరేషన్ ద్వారా 15 వేల మందికి ఆర్థిక సహాయం లక్ష్యం కాగా 19 వేల దరఖాస్తులు అందాయన్నారు. యూనిట్ల మంజూరులో స్పందన కార్యక్రమంలో చేసుకున్న దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలో వివిధ పథకాల అమలులో ఇటీవల నియమితులైన గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్ల సేవలు వినియోగించుకోవాలని కలక్టరు అధికారులకు సూచించారు.

## వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా బాలలకు కంటి పరీక్షలు - కలక్టరు

జిల్లాలో ఈ నెల 10వ తేదీ నుండి మొదటి విడతగా అమలు కానున్న వైఎస్సార్ కంటి వెలుగు విస్తృత ఏర్పాట్లు చేయాలని తద్వారా పాఠశాలల్లో పిల్లలందరికి కంటి పరీక్షలు నిర్వహించాలని కలక్టరు సూచించారు. ఈ పరీక్షలు నిర్వహించడానికి ఆయా పాఠశాల ఉపాధ్యాయులను అవసరమైన శిక్షణ ఇవ్వాలని పరీక్షలు నిర్వహించిన అనంతరం తదుపరి వైద్యం అవసరమయ్యే విద్యార్థుల వివరాలను నమోదు చేయాలని కలక్టరు సూచించారు. ఈ పథకం అమలుపై జిల్లాలో విస్తృత స్థాయిలో ప్రచారం చేపట్టాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పిల్లలందరికి పరీక్షలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ఏజెన్సీ ఏరియాలోని విద్యార్థులకు కంటి వైద్య పరీక్ష నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలక్టరు అధికారులకు సూచించారు.

--2--

వైఎస్సార్ కిశోరి పథకం అమలులో భాగంగా జిల్లాలోని 6 నుండి 10వ తరగతి చదివే పిల్లలతోపాటు జూనియర్ కళాశాల, ఐటిఐ, పాలిటెక్నిక్‌లో చదివే కౌమార దశ విద్యార్థినులకు లైంగిక వేదింపులు, ప్రలోభాలకు గురిచేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించటంతోపాటు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రుతుక్రమంపై అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా 5 సంవత్సరాల పిల్లలులోపు పిల్లలందరికి బరువు, ఎత్తు కొలతలు, గర్భిణీ, పాలిచ్చే తల్లులకు రక్తహీనత పరీక్షలు చేపట్టాలని కలక్టరు సూచించారు.

జిల్లాలో మలేరియా తగ్గుముఖం - కలక్టరు

జిల్లాలో మలేరియా కేసులు క్రమేపి తగ్గాయని డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తంగా వుండాలని కలక్టరు సూచించారు. వైద్యాధికారులతో జరిగిన సమావేశంలో కలక్టరు మాట్లాడుతూ ఈ సంవత్సరం అక్టోబరు 3వ తేదీ నాటికి 274 మలేరియా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయని అన్నారు. 2018వ సంవత్సరంలో ఇదే తేదీ నాటికి 1444 కేసులుగా నమోదు అయ్యాయని అన్నారు. ఈ విధంగా జిల్లాలో మలేరియా క్రమేపి తగ్గుదల సూచిస్తుందన్నారు. అదే విధంగా డెంగ్యూ వ్యాధిని అరికట్టడానికి ఈ వ్యాధులు నమోదైన ప్రాంతాలను హార్ట్‌స్పాట్స్‌గా గుర్తించి అక్కడ ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఆటోల ద్వారా ప్రచార కార్యక్రమం చేపట్టాలన్నారు. జిల్లాలోని పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పరిసరాలు పరిశుభ్రంగా వుండే విధంగా చర్యలు చేపట్టాలని కలక్టరు సూచించారు.

గ్రామ సచివాలయాల్లో మౌళిక సదుపాయాల కల్పన - కలక్టరు

జిల్లాలో ఏర్పాటు చేస్తున్న గ్రామ సచివాలయాలకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని గ్రామ సచివాలయలతో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలక్టరు సూచించారు. జిల్లాలో గ్రామ సచివాలయ భవనాలు లేని చోట్ల అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో సుమారు 200 సచివాలయాలు ప్రైవేటు భవనాల్లో వున్నాయని ఇంకా 200 భవనాలు నిర్మించవలసివుందని కలక్టరు తెలిపారు. సచివాలయ నిర్మాణాలకు కావలసిన డిజైన్లను ప్రభుత్వం ఇప్పటికే పంపడం జరిగిందన్నారు. అదే విధంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా వున్న కార్యాలయ భవనాలను గ్రామ సచివాలయం కోసం వినియోగించాలన్నారు. ప్రతీ గ్రామ సచివాలయానికి పర్నిచర్ , ఆర్వో ప్లాంటు వుండాలని కలక్టరు సూచించారు. గ్రామ సచివాలయ సిబ్బందిని గ్రామ స్థాయిలో జరిగే వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని కలక్టరు సంబంధిత అధికారులకు సూచించారు. స్పందనలో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి అర్జీదారునికి సంతృప్తి కలిగే విధంగా పరిష్కరించాలని కలక్టరు అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో జేసీ-2 జి.రాజకుమారి, డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు, జడ్పీ సిఈఓ ఎమ్.జ్యోతి, డిపిఓ నాగేశ్వరనాయక్, డిఎమ్ అండ్ హెచ్ఓ డా.సత్యసుశీల, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

(సమాచార శాఖ చే జారీ)